


# సమస్య

## రావిపాటి వెంకటరామారావు

## (ఉదయిని 1935 దసరా సంచిక నుంచి)

మాది అసలు గోదావరీప్రాంతమట. కాని మా పూర్వులు ఉద్యోగరీత్యా మైసూరు రాజ్యంలో స్థిరపడిపోయారు. మా తండ్రులు ఇద్దరు అన్నదమ్ములు. మా పెత్తండ్రి మాధవరావుగారు అందరికీ తెలిసే ఉంటారు. ఆయన చాలా కాలం మైసూరు స్టేట్ కౌన్సిలులో మెంబరుగా ఉండేవారు. బ్రిటీషుగవర్న్ మెంటులోనూ, మైసూరు దర్బారులోనూ 'సి. ఐ. ఇ.,' 'రాజసభాభూషణ' మొదలైన బిరుదులు కూడా పొంది మొన్నమొన్ననే పెద్దలలో కలిశారు. మా తండ్రిగారు మైసూరు రివెన్యూ శాఖలో అసిస్టాంటు కమిషనరు, కమిషనరు మొదలైన హోదాలలో పనిచేసి, ఇప్పుడు విశ్రాంతిలో ఉన్నారు. బసవనెగుడిలో పెద్ద మేడా అదీ కట్టి, 'కృష్ణా, రామా' అంటూ కాలం గడుపుతున్నారు.

నా చిన్నతనంలో మా తండ్రిగారికి ఇట్టిట్టే బదిలీలవుతుండేవి. వారితో పాటు నేనూ తిరగవలసివచ్చింది. పది చోట్ల చదివి యెలాగో ప్రైమరీ పరీక్షయ్యాను. ఈ వరస చూస్తే నాకు చదువు వచ్చేలా కనిపించలేదని మా పెదనాయన గారు నన్ను బెంగుళూరు తీసుకు వచ్చారు, నేను వారి పిల్లలో కూడా కలిసి చదువుకోవచ్చునని. మా పెదనాయనగారిని నాన్నగారని పిలిచేవాణ్ణి. మా నాన్నగారికి ఆ రోజులలో 'స్విఫ్ట్' అని ఒక చిన్న రథంలాంటి మోటారుకారుండేది. దానిమీదే మేము స్కూలుకు వస్తూ పోతూ ఉండేవాళ్లం. అప్పటికప్పుడే మా నాన్నగారు పెద్ద భవనం కట్టించారు. ఎనిమిదెకరాలతోటలో ఒక చిన్న రాతికోటలా ఉండేది, గోపురాలూ వాటితోనూ, ఆ చుట్టుపక్కల అన్నీ అటువంటి భవనాలే. మా కోటపేరు 'మేన్షన్స్ గార్డెన్స్'.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

నేనెనిమిదవ తరగతి చదువుతుండగానో ఎప్పుడో రాధ మా నాన్నగారి యింటికి వచ్చింది. అప్పుడామెకు నా వయస్సుంటుందో, నా కంటే కొంచెం చిన్నదో. ఆ అమ్మాయి మా పినతాత మనుమరాలట. అంతక్రితం మేమామెను ఎప్పుడూ చూడలేదు. రాధ కుటుంబానికీ మాకూ అకారణవిరోధ మేదో ఉండడంచేత మా రెండుకుటుంబాలకీ రాకపోకలు లేవు. అయితే మా నాన్నగారు మాత్రం యుక్తిగా మా బంధువులనందరినీ సమానంగానే చూచేవారు. చిరునవ్వుతో ఆహ్వానించేవారు; చిరునవ్వుతోనే సాగనంపేవారు.

రాధకు అంతకు పూర్వం కొద్దిరోజులకిందటే వివాహం అయింది. రాధ భర్త జానకిరావుగారు 'మెకానికల్ ఇంజనీరింగ్' లో 'బి. ఎస్. సి' డిగ్రీ పుచ్చుకొని భద్రావతిలో అసిస్టాంట్ ఇంజనీరుగా కొత్తగా ప్రవేశించారు. రాధతో కూడా ఆయనా వచ్చారు.

మే మొకరోజు సాయంత్రం బడినుంచి ఇంటికి వచ్చేసరికి రాధ మా నాన్నగారి గదిలో పడమటివైపు కూర్చుని పిల్లికూనతో ఆడుతూ ఉంది. ముంగురులు గాలికి చిందులాడుతున్నాయి. ఆమె శిరోజములు తుమ్మెదఛాయలను తిరస్కరిస్తున్నాయి. అప్పుడే స్నానము చేసినట్లుంది, తల పొడిపొడిగా

దువ్వి జారుముడి వేసింది. అందులోనుంచి ఒకటి రెండు మల్లెపువ్వులు తొంగిచూస్తున్నాయి. సూర్యుడపుడే అస్తమింపబోతున్నాడు. అరుణకాంతులు రాధనావరించాయి. ఆమె బంగారు ప్రతిమలాగు ప్రకాశిస్తూ ఉంది. చక్కని ముక్కు. ముఖము కలువరేకులలాంటి కళ్లతో పున్నమనాటి చంద్రబింబంలా ఉంది. ఆమె గులాబిపెదవుల పైని మందహాసం మొలకలెత్తుతూ ఉంది. నాటి విగ్రహం చిత్రించిన పటంలాగ స్థావరంగా నా మనస్సులో ఉండిపోయింది.

మమ్మల్ని చూచి రాధ దిగివచ్చింది. ఆమెనడక సొగసు చూస్తే హంసలు సిగ్గుపడాలి. మలయమారుతంలాగ చల్లగా, ఒక రాణి తఖ్తునుండి దిగివచ్చినట్టు, సావకాశంగా మాకేసి వచ్చింది. మేము దేవలోకంలోనుంచి అప్సరస దిగివచ్చిందా అనుకొన్నాము. కథలో అప్సరసను ప్రేమించినట్లే ఆమెను ప్రేమించాము. ప్రేమ అంటే ఏమిటో కూడా తెలియకుండా ఆమెను ప్రేమించాము. ఆ చిన్ననాటి ప్రేమ ఎప్పటికీ అలా ఉండిపోయింది రాధలో వర్ణించడానికి అలవికాని ఆకర్షణ శక్తీ, జీవకళా యేదో ఉంది. ఆమె మా నాన్నగారి యింట్లో ఉన్న నాలుగురోజులూ స్కూలేమయిందో, పాఠా లేమైనవో కూడా తెలియదు. నేను తప్పనిసరి గదా అని స్కూలుకు మాత్రం వెళ్ళేవాణ్ణి. మిగతా కాలం అంతా రాధతో మా నాన్నగారి పందిరిమంచం చుట్టూ దాగుడుమూతలో, పులిమేకలో ఏదో ఆడుతూ ఉండేవాణ్ణి. రాధకు నాతో ఆడడం సంతోషం. ఈ నాలుగురోజులూ ఒక్క క్షణంలాగ వెళ్లిపోయినవి. కాని యీ నాలుగురోజులలోనూ మా యిరువురకూ శాశ్వతమైన స్నేహం కలిసింది. జానకిరావుగారికి కూడా నా మీద చాలా దయ.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

రాధ వెళ్లిపోయింది. మబ్బులో మెరుపులాగ తళుక్కుమని, మాయమైపోయింది. నాకు కొన్నిరోజులవరకూ, ఏమీ తోచేది కాదు. తరువాత ఎప్పటిలా అయినప్పటికీ, రాధ మాత్రం మరిచిపోలేదు. మా ఆటపాటలూ, మా చిన్నిపరిహాసాలూ, జ్ఞాపకంవచ్చేవి. ఎండాకాలపు సెలవులకు ఎదురుచూచేవాణ్ణి. సెలవులు రాగానే రాధ గారి యింట్లో పదిహేనురోజులు మకాం మా కుటుంబాలకున్న విరోధం మరిచిపోయాను. మా అమ్మ బతిమాలినా, మా నాయన గారు కోపపడినా లెక్క చెయ్యకుండా, ప్రతి సంవత్సరం వెళ్ళేవాణ్ణి. పదిహేను రోజులు నా చిన్న ప్రపంచం అంతా రాధామయమై ఉండేది. సంవత్సరం అంతా రాధను మరిచిపోవాలి కదా అని యీ పదిహేను రోజులూ రాధ తప్ప ప్రపంచం అంతా మరిచిపోయే వాణ్ణి.

సకాలంలో స్కూలుఫైనలు దాటేశాను. మా నాన్న గారు నన్ను మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీలో చేరిపించారు. ఆ రోజులలోనే రాధ భద్రావతి కాపురం వెళ్లిపోయింది.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

ప్రెసిడెన్సీ కాలేజీలో ఐదు సంవత్సరాలు చదివి కెమిస్ట్రీ ఆనర్సు డిగ్రీ పుచ్చుకున్నాను. డిగ్రీ పుచ్చుకున్న ఐదారునెలలకు మా నాన్నగారు నాకు బెంగుళూరు సెంట్రలు కాలేజీలో అసిస్టాంటు ప్రొఫెసరు పని యిప్పించారు. మద్రాసులో చదివేటప్పుడు కూడా వేసంగి సెలవులలో పదిహేనురోజులూ, నెలా, ఇలాగు భద్రావతిలో జానకిరావుగారి యింట్లో గడిపేవాణ్ణి. మా యిరువురికీ గల పరస్పరగౌరవంచేతనూ, అనురాగంచేతనూ, జానకిరావుగారికీ నాకూ గొప్ప స్నేహం కలిగింది. రాధా, నేనూ చిన్ననాటి వలెనే కబుర్లు చెప్పుకుంటూ, చదరంగం అదీ ఆడుకుంటూ గడిపేవాళ్లం. చిన్ననాటి ఆటలూ, పాటలూ, ఆ రోజులలో చేసిన కొంటిపనులూ, అన్నీ జ్ఞాపకం చేసుకునేవాళ్లం. ఆ కొన్నాళ్ళూ మా ప్రపంచం స్వర్గంలా ఉండేది. కాలేజీలో క్లాసులలోనూ, టెన్నిసులోనూ అక్కడా నాకు చాలా మంది కుర్రాళ్లతోనూ, ఆడపిల్లలతోనూ స్నేహం అయింది. కాని చిన్నప్పుడు రాధతో చేసినలాటి స్నేహం నాకు మళ్లీ లభించలేదు. ఆ స్నేహంవల్ల కలిగిన సౌఖ్యం నాకు మళ్లీ కలుగలేదు. రాధకు నాపై ప్రేమ ఉన్నదో లేదో నాకు తెలియదు కాని, మేము కబుర్లు చెప్పుకొనేటప్పుడు ఆమె ముఖం కలకలలాడుతూ ఉండడంచేతనూ, నాకు కావలసిన సౌకర్యాలన్నీ తాను స్వయంగా చూడడంవల్లనూ ఆమెకు నా మీద కొంచెం దయ ఉన్నట్లు కనిపెట్టాను. ఆమెకు నా పై ప్రేమ ఉందా లేదా అనే సంగతి తెలుసుకోవలసిన అగత్యం నాకు లేకపోయింది. నాకు తెలిసినదంతా యింతే; తెలియవలసినదీ యింతే; నాకు కలిగే సౌఖ్యానికీ, ఆనందానికీ, ప్రశాంతికీ రాధ ఆధారం, రాధే కారణం అని.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

నేను 'సెంట్రల్ కాలేజీ' లో ప్రవేశించిన రెండు మూడేళ్లకు రాధని చూడాలని బుద్ధిపుట్టి భద్రావతి వెళ్లాను. జానకిరావుగారూ, రాధా నేను చాలా కాలానికి వచ్చానని సంతోషించారు. జానకిరావుగారొక పెద్దవిందు కూడా చేశారు. ఆయన రెండు రోజులు సెలవుపెట్టి జలపాతానికి ఒక చిన్న ప్రయాణం ఏర్పాటు చేశారు. జానకిరావుగారూ, రాధా, నేనూ, వారిపిల్లలిద్దరూ, ఒకకుక్కా, ఇద్దరునౌకర్లూ — మేమంతా ఒక బస్సు చేసుకువెళ్లాము. రహదారీ

బంగాళాలో మకాంచేశాము. ఉదయం బారెడుపొద్దెక్కేసరికి కాఫీలు తీసుకుని, రాధా నేనూ జానకిరావుగారూ, పిల్లల్ని నౌకర్లు కప్పజెప్పి, కామెరా తీసుకుని జలపాతం చూడడానికి వెళ్ళాము.

ఉదయభానుడప్పుడే తన బాలకిరణాలని కొండలపై ప్రసరింపజేస్తున్నాడు. శిలోపరి భాగాన్ని ఉన్న గొప్పగొప్ప వృక్షాలన్నీ అంచులు గిల్టుచేసిన పటాలలాగ ధగధగ మెరుస్తున్నాయి. మహాతరుశాఖల నావరించి అల్లిబిల్లిగా పాకుతున్న లతలమధ్య నుండి సన్నని సూర్యకాంతులు బంగరుపొడి రాలినట్టు మాపై పడుతున్నాయి. కొండ మీద నుంచి నది మూడు పాయలై, హోరున మహాప్రవాహంకింద ఒక్కసారి అగాధంలో పడి పాలసముద్రంలా పొంగిపోతూ ఉంది. ఈ సంపాతం వల్ల కలిగిన తుషారం ఒక చిన్న మేఘంలాగ ఆకాశానికెక్కి, ప్రతిబిందువు ఒక 'ప్రిజ్మ్' మాదిరి సూర్యకిరణాలని వివిధవర్ణాలుగా ప్రతిఫలింపజేసి, నవరత్నరేణువులన్నీ కలిపి గాలికొక్కమారు ఎగురబోసినట్లుగా, ఆహ్లాదకరంగా ఉంది. మేమంతా మొదట మంటపంమీద కెక్కి ఈ అద్భుతమంతా చూచాము.

జానకిరావుగారు ఫొటోలు తియ్యడం మొదలుపెట్టారు. నేనీ ప్రవాహం పడేచోటకి వెళ్ళి చూస్తానని బయలుదేరాను. నేనూ వస్తానన్నది రాధ. 'జడుసుకుంటావు, రా'వద్దంటే మానింది కాదు, అతి ప్రయాస మీద ఏలాగైతే నేం కిందికి వెళ్లాము. అంత ప్రవాహం గొప్ప పర్వతం మీద నుంచి అంతులేని అగాధంలో ఒక్కసారి పడడం చూచేసరికి నాకే కన్ను చెదిరి పోయింది. రాధ పెద్ద కబుర్లన్నీ కట్టడిపోయినవి. ధైర్యం ఎగిరి చక్కాపోయింది. రాధ కళ్లు తిరిగి మూర్ఛపోయింది. నా చెయ్యి అకస్మాత్తుగా పట్టుకోబట్టి కాని, లేకపోతే రాధ గంగపాలు కావలసినదే ఆ వేళ. నేనామెను సందిట్లో ఉంచుకొని పైకెక్కుతూ వున్నాను. కొంత మెట్ట యెక్కేసరికి రాధ కొంచెం కదిలి కళ్లు విప్పి చూచింది. మా యిద్దరి దృష్టీ మిళితమయింది. ఆ క్షణంలో ఆమె ముఖం మృదులాధరముపై మందహాసము తాండవమాడింది. కాంతిహీనమై వెలవెలపోయే చెక్కిళ్లపైని ఒక్క మారు కుంకుమకాంతులు వెలిగిపోయినవి. ఆక్షణంలో భావోద్రేకం చేత నా శరీరమంతా కంపమెత్తింది. ఆ క్షణంలో నేను పొందిన సంతోషాన్ని, సౌఖ్యాన్ని, ఆనందాన్ని – ఆ తన్మయత్వాన్ని వర్ణించడానికి భాష చాలదు. ఈ సృష్టి అంతా నాలో లయమైపోయింది. భగవంతుడే నాలో మిళిత మైపోయాడు. నేనే సచ్చిదానందమూర్తిననుకున్నాను. ఈ జన్మ తరించిందనుకున్నాను. అంతా క్షణంలోనే. ఈ పది సంవత్సరములూ తేటపడిన నా ప్రేమకు అర్థం ఆ క్షణంలో తెలుసుకొన్నాను. మరుక్షణంలో రాధ కళావిహీన అయిపోయింది. మందహాసం మాసిపోయింది. అరుణకాంతులు అంతరించినవి. ఆమె రెండుచేతులతోనూ కళ్లు గట్టిగా మూసుకొన్నది....

జానకిరావుగారు నేను రాధను మోసుకురావడం చూచి పరుగెత్తుక వచ్చారు. రాధకు కూడా పూర్తిగా తెలివి వచ్చింది. దించమని సంజ్ఞ చేసింది. ఆ పర్వతం పంచను ఒక గడ్డిదిబ్బ మీద కూర్చున్నాను. కొంత విశ్రాంతి తీసుకొని రాధను చెరియొక రెక్క పుచ్చుకొని బంగాళా చేర్చాము. అక్కడ మరి ఉండలేదు. భోజనాలు చేసి బస్సు ఎక్కి భద్రావతి వెళ్లిపోయాము.

★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★ ★

నా డా కొండలోయలో నా మనస్సు నే నెరిగినప్పటినుండి నా ఆత్మ యెడతెగని సంతాపంలో పడిపోయింది. నా జీవితం అధోగతిపాలయిపోయింది. సముద్రం మీద చుక్కానిలేని నావ గతి అయిపోయింది. రాధప్రేమ లేనిదే యీ జీవితం నిస్సారం అని తోచింది. ఆమె లేని ప్రపంచం నాకు కళావిహీనమై శూన్యమై కన్పించింది. అయితే ఆమెను ప్రేమించడం ధర్మవిరుద్ధంగాను, నా ఆత్మగౌరవానికి కళంకంగానూ తోచింది. ఈ సమస్య తీర్చడానికి కొన్ని రోజులు తదేకదీక్షగా తలపోశాను. చివరకు దాని సూత్రం కనిపెట్టాననుకున్నాను. ఈ పది సంవత్సరాలు అవసరం లేదనుకొన్న ప్రశ్నకు నేడు జవాబు కావలసివచ్చింది. కొండవంచలో రాధకు మూర్ఛ తెలిసినప్పుడు ఆమె నయనాలనుండి వెలువడిన తీక్షణకాంతుల కర్థ మున్నదో లేదో తెలియవలసి వచ్చింది. ఇటువంటి ప్రసంగాలామెతో ఇదివరకెప్పుడూ చేయలేదు. ఆమె మనస్సు నొప్పించకుండా నా ప్రశ్నకు జవాబు చెప్పించాలి, ఏం చెయ్యడం అని ఆలోచించి ఒక ఉపాయం పన్నినాను. రాధతో నేనొక కథ వ్రాస్తున్నానని చెప్పాను. నాయకుడు తన ప్రేయసికి ఈలాటి ఉత్తరం వ్రాశాడు అని ఒక ఉత్తరం చేతికిచ్చి, చదివి నాకిమ్మన్నాను. ఆ ఉత్తరం అప్పుడే చింపేశాను. కాని మాటలు కొంచెం ఇంచుమించు జ్ఞాపకం ఉన్నాయి. కథలో ఉత్తరంలా ఉండాలని గ్రాంథికంగా వ్రాశానుః

"ప్రేమ అపారము, అనిర్వాచ్యము, అగ్నిహోత్రుని చందంబున ప్రేమ తన్ను అనుసరించినవానిని దహించివైచును. పున్నమరేయి సముద్రతరంగములవలె పొంగి పొరలి ఆత్మను పరవశము చేయును. కాలకర్మవశమున ప్రస్తుతము నేనట్టియవస్థను చెందితిని. గత పది సంవత్సరములు నేనా ప్రేమ నెరుగజాలనైతిని. కొలదికాలము క్రిందట, ఒక సందర్భమున, దీనియర్థము క్షణములో తేటతెల్లమయ్యె. నాటినుండియు నా హృదయమునకు

రాణిదగు ఆ సుందర మందహాసవదనారవిందమ్ము నిత్యము గాంచక జీవించుట దుర్లభముగనున్నది. నా జీవితమునకు నీ ప్రేమయే మూలాధారమని గ్రహించితిని. నీ ప్రేమ లేని దినము ఈ ప్రపంచము శూన్యము. ఈ సృష్టియే కల్లయైతోచు. నా కనులు మూసినంతనే నీ మోహనవిగ్రము తప్ప వేరొండు కానరాదు. నీ ప్రేమ ప్రసాదము నా కొసంగి నన్నదరించిన సరి; లేదా, యిదియే కడసారి మాట. ఈ ప్రపంచమున లభింపని సౌఖ్యమును పొందుటకు భావిప్రపంచమున నీకై వేచియుండెద."

ఈ ఉత్తరం సాంతంగా చదివింది రాధ. ఆమె ముఖచిహ్నములు చూస్తూనే వున్నాను. చదివినంతసేపు ఆమె ముఖము భావశూన్యంగా ఉంది. చదివి నా వైపు చూచి చిన్న నవ్వు నవ్వింది. ఆమె చదవడం పూర్తి అయిన తర్వాత,

"వాడు ఆత్మహత్య చేసుకున్నాడు సుమా !" అన్నాను.

"అఘోరించాడు. 'కృష్ణా, రామా' అనుకుంటే వాంఛలన్నీ పోతాయిగా !" అన్నది రాధ.

"వాంఛలన్నీ పోతే జీవించడం ఎందుకు? అప్పుడు చచ్చినా బ్రతికినా ఒకటేగా!" అన్నాను నేను.

★★★

.

COMMENTS